
# ఈ వారం కథ

# సర్వజ్ఞులు



— కెమేరావిజయకుమార్

నేను వృత్తిరీత్యా జర్నలిస్టుని.

అయినా ఆ సభలు జరుగుతున్న ప్రాంగణానికి వెళ్ళాల్సిన అవసరం రాగానే నాకెందుకో కాళ్ళాడ లేదు. వెనకటి రోజుల్లో అయితే ఆ ప్రాంగణంలో అడుగుపెడితే కాళ్ళు నరికేసే వారు. ఈ ఆలోచన రాగానే ఒక్కసారి వొళ్ళు జలదరించింది. స్కూట రుమీద బయలుదేరేవన్నమాటేగాని బ్రేకు వేయడానికి కాలు లేదన్న అనుభూతి.

ఈ ఆలోచనల మధ్యే తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణ మంటపం దగ్గరకొచ్చేశాను. గేటుకి అరకిలోమీటరు దూరం నుంచే రోడ్డుకి రువైపులా అంతర్జాతీయ స్థాయిలో రంగు రంగుల జెండాలు. అవి దాటి గేటు దగ్గరకొస్తే గేటుకు కళాత్మకంగా అమర్చిన పెద్ద బోర్డు. దానిపై షుగరు ఫ్యాక్టరీ యజమాని రాయుడిగారి సౌజన్యంతో "అఖిలభారత చతుర్వేద పారాయణ ప్రాంగణం" అని తాటికాయలంత అక్షరాలతో చాలా అందంగా రాసారు.

గేటు లోపలికి ప్రవేశిస్తూ, ఎందుకైనా మంచిదని బ్యాగులోంచి కెమేరాను బయటకు తీసి మెళ్ళో వేసుకొన్నాను. ఆశ్చర్యం! ఎవరూ అడ్డుపెట్టడం లేదు. సరికదా పలకరింపుగా చిరునవ్వులు. 'ఏ పేపరండీ!?' చాలా మర్యాదగా అడుగుతున్నారు.

లోపలికి అడుగుపెట్టాను. అది చాలా పెద్ద హాలు. హాలుమధ్య భాగంలో దూరం దూరంగా పైకప్పు భారాన్ని మోస్తూ నాలుగు స్తంభాలు. [illegible]నగర స్తంభాలల్లా పెద్ద కైవారంతో చాలా ఎత్తుగా వున్నాయి. ఆ స్తంభాలకు వేసిన ఎనామిల్ పెయింటు నియాన్‌లైట్ల కాంతిలో ధగధగా మెరిసిపోతోంది.

ఒక్కొక్క స్తంభం దగ్గర ఒక్కొక్క వేదానికి చెందిన వేద పండితులు గుంపుగా కూర్చుని గట్టిగా వేదపారాయణం చేస్తున్నారు. ఎంత పెద్ద హాలైనా నాలుగు రకాల శబ్దాలతో కీచుదనం పెరిగి "డాప్లర్ సౌండు ఎఫెక్టు' గుర్తుకు వచ్చింది. నాలుగు స్తంభాల కేంద్ర బిందువు వద్ద నిలబడితే వేద పఠనాల హోరుకు చెవులు గళ్ళు పడేలా వున్నాయి.

అన్ని ప్రక్కల నిశితంగా పరిశీలిస్తున్న నా దృష్టి దూరంగా చేతులు కట్టుకుని నిలబడి వున్న మున్సిపల్ డాక్టరుగారి మీద పడింది. ఆయన చాలా వినమ్రతతో ఎదురుగా జరుగుతున్న పారాయణాన్ని తదేకంగా చూస్తున్నారు. వెనుకటి తరాలుకలలో కూడా ఊహించలేని అపురూప దృశ్యం స్వయంగా చూసే అదృష్టం తనకు లభించిదన్న ఆనందంతో ఆబగా చూస్తున్నట్లుంది ఆయన ముఖం. ఆ స్థితిలో డాక్టరుగారిని చూస్తుంటే శ్రీరామచంద్రుని కరవాలానికి బలైన శంభూకుడు గుర్తుకు వచ్చిగుండెలో ఎక్కడో కలుక్కుమంది.

వేల సంవత్సరాలుగా కొద్దిమందికి మాత్రమే పరిమితమైన ఈ వేద పారాయణ ప్రక్రియను రికార్డు చేద్దామనిపించి ఫొటోలు తీయడం మొదలుపెట్టాను. అదీకాక నాలుగు వేదాలు ఒకే చోట పారాయణం చేయడంకూడా అరుదైన విషయం కదా!

ఒక వేద పండితుడు పారాయణం మధ్యలో నశ్యం పీలుస్తున్నాడు. ఆ పోజును భద్రపరుద్దామని కెమెరా క్లిక్ మనిపించాను.

"ఆ బల్బేదో వెలగలేదన్ష!" కన్యాశుల్కంలోని కేరక్టరు కళ్ళెదురుగా వచ్చినట్లైంది. ఆ ప్రయోగం విని ఫ్లాష్ కేసి చూసుకొన్నాను. స్విచ్ ఆపేసుంది. అప్పటివరకు నామీదున్న వేదాల ముద్ర మాయమై వర్తమానంలోకొచ్చి మనసారా ఒక్కసారి నవ్వేను.

ఆ పండితుణ్ణి మరలా ముక్కు పొడుం పీల్చమని సైగతో చెప్పి రెండవ షాటు పర్‌ఫెక్టుగా తీసుకొన్నాను. "ఈసారి బల్బెలిగిందన్ష"! అని అడిగితే తలఊపి పారాయణంలో శృతి కలిపేశాడా పండితుడు.

ఈ గొడవలో పడి నేనొచ్చిన పనినే మర్చిపోయాను. ఉదయాన్నే మా పత్రిక ఇన్‌ఛార్జి ఎడిటరు ఫోన్ చేశారు. ఉగాదికి 'తెలుగునాట ప్రముఖులు" అనే శీర్షికన కొంతమంది ఇంటర్వ్యూలను ప్రచురించాలనుకొంటున్నాం. అందుకని కేంద్ర అకాడమీ అవార్డు గ్రహీత ఆర్.ఎస్.పి.సోమయాజులుగారి ఫొటోలు తీసి, ఆయన బయోడేటాతోపాటు నాలుగైదు ప్రశ్నలతో చిన్న ఇంటర్వ్యూ చేసి రేపటికల్లా పంపించండి అని సెలవిచ్చారు.

స్వామికార్యమై, సోమయాజులుగారి ఇల్లు వెదుక్కుంటూ వెళితే ఆయన ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలుసుకొని ఇక్కడికొచ్చాను. అయితే ఇప్పటివరకూ పారాయణంలో ఫొటోల వేటయింది.

ఫొటోల వేట మాని సోమయాజులుగారి వేటలో పడ్డాను. వేదపారాయణానికి కొద్దిగా ఎడంగా శాలువాలు కప్పుకొన్న పండితులు గట్టిగా ముచ్చటించుకొంటుంటే వారి దగ్గరకెళ్ళి సోమయాజులగారి గురించి వాకబు చేసా. సర్వాంగ సుందరంగా అలంకరించిన స్టేజిమీద మైకు పుచ్చుకుని ప్రసంగించడానికి సిద్ధమవుతున్న వ్యక్తిని చూపారా పండితులు.

సోమయాజులుగారు వేదసారాంశంపై మాట్లాడటం మొదలుపెట్టారు. హాలంతా నిశ్శబ్దమైపోయింది. అందరూ దృష్టి సోమయాజులుగారిపై కేంద్రీకరించారు.

నేను స్టేజి దగ్గరకెళ్ళి క్లోజప్లో సోమయాజులు గారివి రెండు స్టిల్సు తీసుకొన్నాను.

మాట్లాడం పూర్తి అయిన తరువాత సోమయాజులుగారు స్టేజిదిగి ఆర్గనైజర్లకు పనులు పురమాయిస్తున్నారు. అప్పుడు ఆయన దగ్గరకెళ్ళి నన్ను పరిచయం చేసుకొని వచ్చిన పని చెప్పాను.

సోమయాజులుగారు వేలికున్న బంగారు కడియాన్ని తిప్పుతూ కొద్దిసేపు ఆలోచించి, "ఈరోజు సాయంత్రం సామూహిక సంధ్యావందనం తరువాతకూడా ముఖ్యమైన కార్యక్రమాలున్నాయి. రేపు ఉదయంతో మా కార్యక్రమాలు ముగుస్తాయి. అందుకని రేపు పది గంటలు దాటిన తరువాత ఇక్కడకు రండి. తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అని హామీ ఇచ్చి నన్ను పంపించేసారు.

రెండవ రోజు నేను అక్కడికి వెళ్ళే టైముకి కార్యక్రమం చివరి సీనులో కొచ్చింది. రాయుడు గారు పారాయణంలో పాల్గొన్నవారికి సంభావనలు అందచేయడం మొదలుపెట్టారు.

అయిదు నిముషాలు గడిచాయో లేదో సగం మంది వేద పండితులు హాల్లో రెండు స్తంభాల దగ్గర రెండు గ్రూపులుగా చేరి గుస గుసలాడటం మొదలుపెట్టారు. ఆ గుస గుసలస్థాయి పెరిగి గొడవగా మారింది. కొద్ది సేపట్లో ఆ రెండు గ్రూపులు ఒకటిగా అయిపోయి హాలు మధ్యలో కూర్చుండిపోయారు.

అందరి ముఖాలు ఆవేశంతో జేవురించి వున్నాయి. సంభావనలు తీసుకోం అని నిరసన తెలియచేసేరు. ఆ పండితులను చూస్తుంటే కష్టానికి తగ్గకూలి పెంచి న్యాయం చేయమని షుగరు ఫ్యాక్టరీ ముందు సమ్మె చేసిన కార్మికుల ముఖాలు గుర్తుకు వచ్చాయి.

వేద పండితుల నిరసనకు అసలు కారణం కొద్ది సేపటికిగాని తెలియలేదు. రుగ్వేద, అధర్వణ వేదాలు పారాయణం చేసినవారికి పట్టువస్త్రాలతో పాటు రు.2116/- ఇచ్చారట! మిగిలిన వేదాలు పారాయణం చేసిన వారికి పట్టువస్త్రాలతోపాటు రు.1116/- మాత్రమే ఇస్తున్నారట!

మా వేదాలు ఏం తక్కువ తిన్నాయి? మేం మాత్రం వేదపారాయణం చేయలేదా?? మాలో మాకు ఈ తేడాలేమిటి??? అదీ నిరసనకుగల ముఖ్యకారణం. వారు నిరసన తెలియచేయడంలో ఏ మాత్రం తప్పు లేదనిపించింది.

"సంభావనలకు కేటాయించిన సొమ్ము ముందే నిర్ణయించింది. కనుక ఇప్పుడు అందరికి సమానంగా ఇవ్వడం సాధ్యపడదు". అని నిరసన తెలియచేస్తున్న పండితులకు సోమయాజులుగారు నచ్చచెప్ప చూసారు. అయినా వారు చెవిన పెట్టడంతో, వేదాలలో హెచ్చు తగ్గులు శాస్త్రపరంగా వచ్చినవి తప్ప అవి ఆర్గనైజర్ల పైత్యం కాదని మండిపడుతున్నారు.

ఎవరెన్ని చెప్పినా నిరసన చేస్తున్న పండితులు మాత్రం పట్టిన పట్టు విడవక అలాగే భీష్మించుకొని కూర్చున్నారు.

సంభావనలు ఎక్కువ పుచ్చుకొన్న పండితులు ఆర్గనైజర్ల తరఫున వకాల్తా పుచ్చుకొని బరిలోకి దిగారు. రెండు వర్గాలమధ్య వాదోపవాదాలు మొదలైనాయి. అసెంబ్లీలో అధికార అనధికార ప్రతినిధుల స్థాయిలో వాళ్లు తిట్టుకోవడం మొదలుపెట్టారు.

ఇరుప్రక్కల ఘనాపాటీల మధ్య వాగ్వివాదం ఎంతవరకు వచ్చిందంటే ఆర్గనైజర్లు మధ్యలో అడ్డుపడకపోతే కాట్లకుక్కల్లా మీదపడి కరచుకొనే వారనిపించింది.

పంచదార ఫ్యాక్టరీ యజమాని రాయుడు చాలా నిక్కచ్చైన మనిషని ప్రతీతి. ఆయన ఒక్కసారి నిర్ణయం తీసుకొంటే ఎటువంటి పరిస్థితుల్లోనూ మార్చుకోడు. ఈ విషయం ఆయన ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులందరికి బాగా తెలుసు. ఈ పండితులకు తెలుసో తెలియదో అని జాలిగా అనుకొన్నాను.

నాలో సంఘర్షణ మొదలైంది. ఇప్పుడు పోలీసులు రంగప్రవేశం చేస్తారా? లాఠీఛార్జి జరుగుతుందా?? ఎందుకైనా మంచిదని కెమెరా తీసి ఫ్లాష్ బిగించి రడీ చేశా!

నా అంచనాలన్నీ తల్లకిందులైనాయి. రాయుడుగారు షుగర్ ఫ్యాక్టరీ ఎకౌంటెంటును పిల్చి బాంకుకెళ్ళి అందరకూ రు.2116/- ఇవ్వడానికి సరిపడా సొమ్ము తీసుకొని రమ్మని ఆదేశించారు.

ఈ నిరసన ప్రహసనంతో సంభావనాల కార్యక్రమం పూర్తి అవ్వడానికి మధ్యాహ్నమయింది. సంభావనలు సమానంగా రావడానికి పోరాటం చేసి సాధించిన విజయంతో ఘనాపాటీల ఛాతీలు పైకెగశాయి,

నాకు మాత్రం జీవితంలో మరో రెండు చిక్కుముడులు పెరిగాయి. లాఠీదెబ్బలకు ప్రక్క టెముకలు విరిగిన ఫ్యాక్టరీ కార్మికులకు జీతాలెందుకు పెరగలేదు? ఇప్పుడు దానం చేస్తున్న సొమ్ము ఎవరి శ్రమ ఫలితం??

నేను వచ్చి రెండుగంటలైనా సోమయాజులు గారిని కలవడం కుదరలేదు. ఎంతో కష్టంమీద ఆయనను కలిస్తే, "అరె ఇప్పుడువచ్చారా? అయినా ఫర్వాలేదు. ఎకాఎకిని మా ఇంటికి రండి. మేము ఉత్కళ యూనివర్శిటీనుండి వచ్చిన పండితులను తీసుకొని కారులో వచ్చేస్తున్నాం" అని నన్ను పురమాయించారు.

విసుగు చెందని విక్రమార్కుడిలా సోమయాజులుగారింటికెళ్ళాను. లోపలంతా చాలా సందడిగా వుంది. వీధి వరండాలో కుర్చీలుంటే ఒక కుర్చీలో కూలబడ్డాను.

సోమయాజులగారి పెద్దబ్బాయి హడావిడిగా నా దగ్గరకొచ్చి నేనెందుకు వచ్చానో తెలుసుకొని బాధపడిపోయాడు. "నిన్ననే నాన్నగారి బయోడేటా సెట్లు అయిపోతే మళ్ళీ ఫొటోస్టాట్ చేయమని ఇచ్చాను. సాయంత్రం వచ్చి ఒక సెట్టు తీసుకెళ్ళండ"ని వినయ పూర్వకంగా చెప్పాడు. ఆయన కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారట. సోమయాజులుగారు సాయంత్రం బెనారస్ వెళుతున్నారని సవినయంగా మనవి చేసాడు.

సోమయాజులుగారు వస్తున్న కారు హారన్ గేటు బయట వినిపించింది. అంతే ఇల్లంతా ఒక్కసారి నిశ్శబ్దం అయిపోయింది. ఇంట్లో సభ్యులు గదుల్లోకి, స్తంభాల చాటుకి తప్పుకొన్నారు.

ముగ్గురు పండితులతోపాటు సోమయాజులు గారు కారు దిగి లోపలికి వేంచేశారు. వారందరూ అక్కడే వున్న కుర్చీలలో ఆసీనులయ్యారు. సోమయాజులుగారు ఆ పండితులు సంభాషించుకొంటుంటే నాకు సంస్కృత వార్తలు విన్నట్లయింది.

సోమయాజులుగారు వరండా గోడకు అంటుకొని వున్న కొడుకును పిలిచి, "వీరు అప్పడే భోంచేయరట, ఓ అరగంట ఆలస్యంగా వడ్డనలు ప్రారంభించమని ఆజ్ఞాపించారు.

అప్పుడు సోమయాజులుగారు నన్నుచూసి ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి, "ఏం పనిమీద వచ్చేరు?"అని నన్ను మొదటిసారి చూసినట్లు ప్రశ్నించారు.

నేనొచ్చిన పనిని ఏకరువు పెట్టాను మరోసారి.

"అబ్బాయినడిగి మా బయోడేటా తీసుకోండి. ఇంకా మీరేమైనా అడగాలనుకొంటే నిశ్శంకోచంగా అడగండి" అని సోమయాజులుగారు నాకు భరోసా ఇచ్చారు.

నాతో సోమయాజులుగారు మాట్లాడటం మొదలు పెట్టేసరికి ఆ వచ్చిన పండితులుకూడా నావైపు కుర్చీలు తిప్పుకొని కూర్చున్నారు.

మహిళలు వేదం చదవకూడదని పూరీ పీఠాధిపతి చేసిన వ్యాఖ్య వివాదంగా మారితే తరువాత ఆ విధంగా అనలేదని ఆయన సర్దుకొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ "మహిళలు వేదం చదవడంపట్ల మీ అభిప్రాయమేమిటి? అని నా మొదటి ప్రశ్న అడిగాను.

దానికి సోమయాజులుగారి ముఖం గంభీరంగా మారింది. కొద్దిసేపు ఏమి మాట్లాడలేదు. తలను అడ్డంగానూ నిలువుగానూ ఊపి ప్రక్కనే వున్న సంస్కృత పండితులతో మంతనాలు జరిపారు. చివరకు నావైపు తిరిగి, "ఇందులో మా అభిప్రాయమెందుకు, మహిళలు వేదం చదవకూడదని స్పష్టంగా శాస్త్రమే చెబుతుంటే. ఎన్ని వివాదాలొచ్చినా మేము మాత్రం శాస్త్రంలో వున్నదే చెబుతాం." చాలా అథారిటీతో అన్నారు.

"వేదాలు చదవడంవల్ల ప్రయోజనమేమిటి? వాటిని ఎవరు చదవచ్చు?" సోమయాజులుగారి జవాబే నన్నీ ప్రశ్న వేయించింది.

"వేదాలు చదవడం వల్ల ముక్తి వస్తుంది"అది కూడా తెలియదా అన్నట్లు నన్ను చూసారు సోమయాజులుగారు. ఆయన వేసుకొన్న పెద్దాపురం శిల్కు లాల్చీ ప్రక్క జేబులోంచి వెండి ముక్కు పొడుం డబ్బాను బయటకు తీశారు. కుడిచేతి చూపుడు వేలు బొటనవేలుతో ఓ పట్టు తీసుకొని, ఎదురుగా కూర్చున్న పండితులకొరకు డబ్బాను ముందుకు చాచారు. "వేదాలు చదవాలంటే ముందు ఉపనయన మహోత్సవం జరగాలి" అని నా ప్రశ్న రెండో భాగానికి జవాబిచ్చారు.

వారు పీల్చిన ముక్కు పొడుం గాటుకు నాకు తుమ్ములు వచ్చాయి. రెండు తుమ్ములు తుమ్మిన తరువాత, "ఉపనయనం ఎవరైనా చేసుకోవచ్చా?" వింతగా కదులుతున్న సోమయాజులగారి చెవి కుండలాలకేసి చూస్తూ అడిగాను.

"గతంలోఎన్.టి.రామారావుగారు అధికారంలో వున్నప్పుడు మమ్ములను రాజధానికి పిలిపించుకొని ఇదే ప్రశ్న వేశారు. అప్పుడు బ్రాహ్మణ, క్షత్రీయ, వైశ్య పురుషులు మాత్రమే శాస్త్రరీత్యా ఉపనయనం చేసుకొనటానికి అర్హులని చెప్పి శాస్త్ర ప్రమాణాలు చూపించాం" గండపెండేరమున్న కాలిని వేలకేసి కొడుతూ చాలా దర్పంగా వచించారు.

పెద్ద పండితున్ని ఏం ప్రశ్నలు వేయాలా అన్న సందిగ్ధంలోంచి ఆయన జవాబులే నాకు ప్రశ్నలు తెచ్చిపెడుతున్నాయి. సామాన్య మానవుడికి ఈ సందేహాలన్నీ వచ్చినా సోమయాజులగారి స్థాయికొచ్చి అడిగే ధైర్యం వుండదు. నేనైనా పత్రికా ప్రతినిధిననే కొంచెం మర్యాదగా జవాబులిస్తున్నారు. లేకపోతే సంస్కృతంలో ఏదోచెప్పి బయటకు గెంటేసేవారే!

"మరి బ్రాహ్మణ స్త్రీలకు, శూద్రులకు ముక్తి అవసరం లేదా?" అంటరాని వారి గురించి అడగటం లేదని మనస్సులో తొలిచేస్తున్నా, సగమైనా సామాజిక స్పృహతోనే ఈ ప్రశ్న అడిగాను అని సమాధానపర్చుకొన్నా.

"వేదాలు చదవడానికి అర్హత లేనివారికోసమే ఇతిహాసాలున్నాయి. అవి చదవటం వల్ల వారికి ముక్తి వస్తుంది" అని మెడలోని రుద్రాక్షమాలకు, బంగారగుళ్ళ గొలుసుకు పడిన చిక్కును తీస్తూ సావధానంగా చెప్పారు సోమయాజులుగారు.

వేదాలకు, ఇతిహాసాలకు మధ్య పదిహేను వందల సంవత్సరాలనుండి రెండువేల సంవత్సరాల తేడా వుందని చరిత్ర చెబుతుంది. అంతకాలం వీరందరికి ముక్తి లేకుండా పోయిందా?" చరిత్రమీద అథారిటీతో నేను ప్రశ్నించానీసారి.

సోమయాజులగారి కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. "మీరుచాలా యుక్తిగా ప్రశ్నలు వేస్తున్నారు... లిప్తకాలం తేడాతో వేదాలు ఇతిహాసాలు పుట్టాయని శాస్త్రం చెబుతోంది. శాస్త్రంకంటే గొప్పదా చరిత్ర?" అని ఛీత్కరించుకొంటున్నట్లు ముఖం పెట్టారు.

దూరంగా చేతులు కట్టుకొని నిలబడి వున్న లెక్చరర్ కొడుకును పిలిచి అతిధులకు భోజనాలు వడ్డించమని ఆదేశాలు జారీ చేశారు.

నాకు అర్థమైపోయింది. ఇంటర్వ్యూ ఇకసాగదని. అందుకే చివరి ప్రశ్న అని చెప్పి "చదువుల తల్లి సరస్వతికి వేదాలు వచ్చా' నేనీ ప్రశ్నను యుక్తిగా అడగటంలేదు. మా పత్రిక చదివే వారు కనీసం చదువుకొన్న వారై యుంటారు. వారి ఆలోచనా స్థాయికూడా కొంచెం ఎక్కువగా వుంటుంది, అందుకని అడుగుతున్నాను."

నా ప్రశ్నకు సంస్కృతంలో తర్జన భర్జనలు జరిగాయి. పండితులు మల్లగుల్లాలు పడ్డారు. నన్ను వారు తీక్షణ వీక్షణాలతో ఓ పురుగును చూసినట్లు చూసారు. వారి చూపులకే శక్తి వుంటే నేనక్కడికక్కడే భస్మమై పోయేవాణ్ణి.

చివరికి సోమయాజులుగారు భుజాలమీదనుండి వేలాడుతున్న పట్టుశాలువాను ప్రక్కనపడేస్తూ, "ఐదుగురు భర్తలున్న ద్రౌపది ఎలా ప్రతివ్రతో అలానే సరస్వతి స్త్రీ అయినా వేదాలు వల్లించింది." అని సోమయాజులుగారు పెద్ద జోకు వేసినట్లు పగలబడి నవ్వారు. ఆ వచ్చిన పండితులుకూడా ఆయనతో శృతి కలిపారు. ఆ నవ్వులలో పురషాధిపత్యమే కాదు పురుషాంకారమూ బయటపడింది.

ఆ జవాబు, వారి ప్రవర్తన చూసి నేను షాక్ తిన్నాను. కాసేపు నోటమాట పెగల్లేదు. నన్ను యుక్తిగా ప్రశ్నిస్తున్నావని సోమయాజులుగారు వెటకారం చేశారు. కాని వారు చెప్పిన జవాబుల్లో ఆ యుక్తికూడా లేదు. పూర్తి కుయుక్తి తప్ప.

నేటిక్కూడా సమాజాన్ని కొన్నివేల సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్ళడానికి తన పూర్తి మేధస్సును ఉపయోగిస్తున్నందుకే సోమయాజులుగారికి కేంద్ర ఎకాడమి వారు అవార్డు ఇచ్చారనిపించింది.

నాళ్ళతో చెప్పినైనా చెప్పకుండా బయటకు వచ్చేశాను. అక్కడినుండి నేరుగా టెలిగ్రాఫ్ ఆఫీసుకెళ్ళి మా పత్రికా ఇన్‌ఛార్జి ఎడిటర్‌కి టెలిగ్రామ్ ఇచ్చాను. "సోమయాజులుగారు ఆంధ్రనాట ప్రముఖులు శీర్షికకు అందుబాటులో లేరు– కాశీకి వెళ్ళారు."